


# కరపత్రం

SINCE 2014

శనివారం ఆగస్ట్ 22, 2026 | సంపుటి : 2 | సంచిక : 311 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



## ప్రతిష్ఠాత్మక ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీని సందర్శించిన సీఎం రేవంత్

**ప్రతిష్ఠాత్మక ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీని సందర్శించిన సీఎం రేవంత్ రెడ్డి.**

- సుమారు 900 ఏళ్ల చరిత్ర కలిగిన వర్సిటీలో ప్రతినిధి బృందంతో పర్యటన.
- బ్లావాట్‌నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను సందర్శించిన సీఎం.
- ప్రొఫెసర్లు మాయా ట్యూడర్, ఫైసల్ దేవ్జీతో భేటీ.
- తెలంగాణ ప్రతినిధి బృందంతో విద్యా, పరిపాలన అంశాలపై చర్చ.

బ్రిటన్:
లండన్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ప్రపంచంలోనే అత్యంత పురాతన, ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాల్లో ఒకటైన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీని సందర్శించారు. దాదాపు 900 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ విశ్వవిద్యాలయంలో శుక్రవారం (ఆగస్ట్ 21) సీఎం ప్రతినిధి బృందంతో కలిసి పర్యటించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ పరిధిలోని బ్లావాట్‌నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను కూడా ముఖ్యమంత్రి సందర్శించారు. ఆక్స్‌ఫర్డ్ అనుబంధ విద్యాసంస్థల్లోని నూతన సంస్థల్లో ఇది ఒకటి.
ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాయా ట్యూడర్, ప్రొఫెసర్ ఫైసల్ దేవ్జీ తెలంగాణ ప్రతినిధి బృందాన్ని క్యాంపస్‌లో కలిశారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి భారతదేశంతోనూ ప్రత్యేక అనుబంధం ఉందని.. మాజీ ప్రధానమంత్రి దివంగత ఇందిరా గాంధీ ఆక్స్‌ఫర్డ్‌లో విద్యాభ్యాసం చేశారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుతో పాటు ఇతర అధికారులు, ప్రతినిధులు ఉన్నారు.



## రూ.62,500 కోట్లతో 'మేక్ ఇన్ ఇండియా' ధమాకా!

- మొబైల్ తయారీకి కేంద్రం రూ.62,500 కోట్ల పథకం.
- దేశీయ బ్రాండ్లు, డిజైన్--ఆర్అండ్‌డీకి భారీ ప్రోత్సాహకాలు.
- స్వదేశీ విడిభాగాలపై అదనంగా 1.5% ఇన్సెంటివ్.
- భారతీయ బ్రాండ్ల డిజైన్, ఆర్అండ్‌డీకి మరో 3% ప్రోత్సాహకం.
- ఐదేళ్లలో రూ.39 లక్షల కోట్ల మొబైల్ ఉత్పత్తి లక్ష్యం.
- సుమారు 60 వేల ప్రత్యక్ష ఉద్యోగాల కల్పనకు ప్రణాళిక.

భారత్‌ను గ్లోబల్ ఎలక్ట్రానిక్స్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా కేంద్ర ప్రభుత్వం సరికొత్త ప్రణాళికను అమల్లోకి తెచ్చింది. రూ.62,500 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా ప్రకటించిన 'మొబైల్ ఫోన్ మేన్యుఫాక్చరింగ్ స్కీమ్' (ఎంపీఎంఎస్) మార్గదర్శకాలను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. ఈ పథకం 2026 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వచ్చింది. ఈ మార్గదర్శకాల ప్రకారం, ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు (పీఎల్ఐ) పొందడానికి ప్రస్తుత మొబైల్ తయారీ సంస్థలు, కాంట్రాక్ట్ తయారీదారులు 2025-26 ఆర్థిక సంవత్సరంలో (FY26) కనీసం రూ.10,000 కోట్ల టర్నోవర్ కలిగి ఉండటం తప్పనిసరి. అదే సమయంలో 51 శాతం స్వదేశీ భాగస్వామ్యం ఉన్న ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ సర్వీసెస్ (ఈఎంఎస్) కంపెనీలకు టర్నోవర్ పరిమితిని రూ.1,000 కోట్లుగా నిర్దేశించారు.

### ♦ భారతీయ బ్రాండ్లకు ప్రోత్సాహకాలు

కేవలం అసెంబ్లీ రంగానికే పరిమితం కాకుండా దేశీయ బ్రాండ్లను ప్రోత్సహించడం, డిజైన్, పరిశోధన-అభివృద్ధి రంగాల్లో భారత్ సాధికారత సాధించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఈ మార్గదర్శకాల్లో భాగంగా.. మార్కెట్లో ఉన్న బ్రాండ్లు తమ ఐదేళ్ల కాలవ్యవధిలో ఏటా FY26 విక్రయాల కంటే అదనంగా రూ.5,000 కోట్ల విక్రయాల వృద్ధి (ఇంక్రిమెంటల్ సేల్స్) నమోదు చేయాలి. కొత్తగా వచ్చే బ్రాండ్లు రూ.10,000 కోట్ల వార్షిక విక్రయాలు సాధించాలి. అర్హత సాధించిన విక్రయాలపై 2.25%-2.75% వరకు ప్రోత్సాహక సాయం అందుతుంది. డిస్‌ప్లే మోడ్యూల్స్, బ్యాటరీలు, ఛార్జర్లు వంటి భాగాలను దేశీయంగా సేకరిస్తే అదనంగా 1.5% ప్రోత్సాహకం, డిజైన్, ఆర్ అండ్ డీ చేపట్టే భారతీయ బ్రాండ్లకు మరో 3% అదనపు ప్రయోజనం కల్పిస్తారు. ఐదేళ్ల వ్యవధిలో దేశంలో రూ.39 లక్షల కోట్ల విలువైన మొబైల్ ఫోన్ల ఉత్పత్తి సాధించడం, అలాగే దాదాపు 60,000 ప్రత్యక్ష ఉపాధి అవకాశాలను సృష్టించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.



## అందుకే సీఎం రేవంత్ అమెరికా పర్యటనకు అనుమతివ్వలేదు: కేంద్రం

ఢిల్లీ:
తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించిన విషయం తెలిసిందే. దీనిపై విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జయస్వాల్ స్పందించారు. ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

2 లో



## పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్న మంత్రి వివేక్

హైదరాబాద్:
నగరంలోని మాసబ్‌ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో మంత్రి వివేక్ ముఖాముఖి నిర్వహించారు. ఆందోళన చేస్తున్న విద్యార్థుల సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు.

## రాయదుర్గంలో TGIIC భూముల వేలం.. ఎకరం రూ.264 కోట్లు !

- » రాయదుర్గంలోని TGIIC భూముల వేలంలో భారీ ధర.
- » ఎకరం రూ.264 కోట్లు పలికిన భూమి.
- » సర్వే నం.83/1లో 5.25 ఎకరాలకు ఆన్‌లైన్ వేలం.
- » భూములకు భారీ డిమాండ్.. రికార్డు ధరతో అందరి దృష్టి.
- » హైకోర్టు నిరాకరణ నేపథ్యంలో కొనసాగిన వేలం.

హైదరాబాద్:
రాయదుర్గంలోని TGIIC భూములు వేలంలో రికార్డు ధర పలికాయి. TGIIC భూమి ఎకరా రూ.264 కోట్లు పలికింది. రాయదుర్గంలోని సర్వే నం.83/1లోని 5.25 ఎకరాలకు ఆన్‌లైన్‌లో వేలం నిర్వహించారు.




2లో..

## చెప్పాల్సింది కమిటీకి చెప్పా.. సీఎం వచ్చాక మాట్లాడతా

- ▪ కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు
- ▪ షోకాజ్ నోటీసుపై క్రమశిక్షణ కమిటీకి వివరణ ఇచ్చా.
- ▪ ఇక ఈ అంశంపై మీడియాతో మాట్లాడను.
- ▪ సీఎం రేవంత్ విదేశీ పర్యటన నుంచి వచ్చాక మాట్లాడతా.
- ▪ కుమార్తె వ్యాఖ్యలు వ్యక్తిగతం.. తనను బాధ్యురాలిని చేయొద్దని వివరణ.
- ▪ సురేఖ కుమార్తె వ్యాఖ్యలపై కాంగ్రెస్‌లో తీవ్ర చర్చ.

హైదరాబాద్:
కాంగ్రెస్ షోకాజ్ నోటీసుల అంశంలో తాను చెప్పాల్సింది క్రమశిక్షణ కమిటీకి చెప్పానని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ విషయంపై ఇప్పుడు మీడియాతో మాట్లాడబోనని చెప్పారు. "నేను చెప్పాల్సింది నిన్ననే క్రమశిక్షణ కమిటీకి చెప్పా. ఇప్పుడు కొత్తగా చెప్పాల్సిన విషయాలేమీ లేవు. సీఎం రేవంత్ విదేశీ పర్యటన నుంచి వచ్చాక మాట్లాడతాను"అని కొండా సురేఖ అన్నారు.



2 లో



## ఎమ్మెల్యేల ఫిరాయింపుపై ఉత్కంఠ!

- » పార్టీ ఫిరాయింపు కేసులో హైకోర్టులో వాదనలు పూర్తి.
- » సెప్టెంబర్ 16న తుది తీర్పు వెలువడనుంది.
- » ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడుతుందా? అనే ఉత్కంఠ.
- » స్పీకర్ నిర్ణయాలను సవాల్ చేసిన బీఆర్ఎస్, బీజేపీ నేతలు.
- » ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పు రిజర్వ్ చేసింది.

2లో..

హైదరాబాద్:
తెలంగాణ స్టేట్ పాలిటిక్స్ లో హాట్ టాపిక్ గా మారిన ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసులో హైకోర్టులో ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. 2026, సెప్టెంబర్ 16న తెలంగాణ హైకోర్టు తుది తీర్పు వెలువరించనుంది. దీంతో హైకోర్టు నిర్ణయం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడుతుందా లేదా అనేది తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



## రూ.108 కోట్లతో అంబేద్కర్ నాలెడ్జ్ టవర్

- ♦ లోయర్ ట్యాంక్‌బండ్‌లో పాత బిల్డింగ్ స్థానంలో కొత్త టవర్
- ♦ 10 అంతస్తుల బిల్డింగ్ నిర్మాణానికి సర్కారు జీవో జారీ

2లో..

హైదరాబాద్,
లోయర్ ట్యాంక్‌బండ్‌లోని పాత అంబేద్కర్ భవనం స్థానంలో రూ.108 కోట్లతో అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఎస్సీ సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేందిర బోయి గురువారం జీవో జారీ చేశారు. సెల్లార్, గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు మరో 10 అంతస్తులతో టవర్‌ను నిర్మించనున్నారు. నిర్మాణానికి రూ.108 కోట్లు ఖర్చవుతాయని ఆర్అండ్‌బీ శాఖ అంచనా వేసింది. ప్రస్తుతం లోయర్ ట్యాంక్‌బండ్‌లో ఉన్న జీ ప్లస్ 1 పాత భవనం 12 ఏండ్లుగా నిరుపయోగంగా ఉంది. దాని స్థానంలోనే కొత్త టవర్‌ను నిర్మించనున్నారు. టవర్‌కు అవసరమైన ఆర్కిటెక్చర్, స్ట్రక్చరల్ డిజైన్ కోసం నిపుణుల సేవలు తీసుకోనున్నారు.



## మార్గదర్శి అంశం.. నిజాయతీకి దక్కిన మహోన్నత విజయం: వెంకయ్యనాయుడు

హైదరాబాద్:
మార్గదర్శి అంశంలో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు నిజాయతీకి దక్కిన మహోన్నత విజయమని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. "మార్గదర్శి వ్యవహారంలో సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన చరిత్రాత్మక తీర్పు నిజాయతీకి దక్కిన మహోన్నత విజయం. రామోజీరావు హిమాలయమంత ధైర్యం, ఆత్మవిశ్వాసంతో ఆ నిందారోపణలను ఎదుర్కొని సుదీర్ఘ న్యాయ పోరాటం చేశారు. అంతిమంగా ధర్మమే గెలిచింది"అని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. మార్గదర్శి అంశంలో సుప్రీంకోర్టు తీర్పుపై ఎంపీ చింతకాయల విజయ్ స్పందించారు. "రామోజీరావును దెబ్బ తీసేందుకు అనేక మంది ఎన్ని కుట్రలు పన్నినా చివరకు ధర్మమే గెలిచింది. ఆయన నిప్పులాంటి మనిషి అని మరోసారి రుజువైంది. రామోజీగ్రూపు సంస్థలు పారదర్శకతకు పెద్దపీట వేస్తాయి" అని విజయ్ పేర్కొన్నారు.

## మంత్రి కొండా సురేఖ సారీ చెప్పాలి: ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



హైదరాబాద్ :
సీఎం రేవంత్ రెడ్డిపై మంత్రి కొండా సురేఖ కూతురు సుష్మిత వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. పార్టీలో ఉంటూ సొంత పార్టీ నేతలపైనే విమర్శలు చేస్తున్నారంటూ కాంగ్రెస్ నేతలు మంత్రి కొండా సురేఖపై తీవ్ర విమర్శలు చేశారు. కొండా సుష్మిత వ్యాఖ్యలపై ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తీవ్రస్థాయిలో మండిపడ్డారు. స్థానికనగర గైడ్‌లను పరిశీలించడం సీఎం రేవంత్ రెడ్డిపై కొండా సుష్మిత చేసిన వ్యాఖ్యలను ఖండించారు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య. సుష్మిత కామెంట్లపై మంత్రి కొండా సురేఖ ఖండించాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి కొండా సురేఖ సారీ చెప్పాలని డిమాండ్ చేశారు.

మిగతాద్ది 2 లో

## చెప్పాల్సింది కమిటీకి చెప్పా..
# సీఎం వచ్చాక మాట్లాడతా

మొదటిపేజీ తరువాయి
ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మంత్రికి కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌కు వివరణ పంపారు. సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని.. ఈ విషయంలో తనను బాధ్యురాలిని చేయొద్దని అందులో కోరారు.మరోవైపు కొండా సురేఖ కుమార్తె చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకొన్నట్లు సమాచారం. నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మంత్రి కుమార్తె చేసిన విమర్శలు, ఆరోపణలు కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులివ్వడంతో పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## రాయదుర్గంలో TGIIC భూముల వేలం.. ఎకరం రూ.264 కోట్లు !

మొదటిపేజీ తరువాయి
రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గం పన్మక్తలోని సర్వే నంబర్ 83/1లో ప్లాట్ల వేలాన్ని నిలిపివేసేందుకు హైకోర్టు నిరాకరించిన క్రమంలో శుక్రవారం వేలం జరిగింది. చారిత్రక నిర్మాణాలు, రాళ్లు ఉన్న ప్రాంతంలో జోక్యం చేసుకోబోమని ప్రభుత్వం హామీ ఇచ్చిన నేపథ్యంలో వేలంలో జోక్యం చేసుకోలేమని కోర్టు స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (TGIIC) భూములకు మస్తు డిమాండ్ ఉంది. ఈ క్రమంలోనే.. రాయదుర్గంలోని పాన్ మక్త భూములకు టీజీఐఐసీ వేలం నిర్వహించింది.

## ఎమ్మెల్యేల ఫిరాయింపుపై ఉత్కంఠ!

మొదటిపేజీ తరువాయి
బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దానం నాగేందర్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలె యాదయ్య, కడియం శ్రీహరి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, టి. ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ, తెల్లం వెంకటరావు, సంజయ్ కుమార్ పై దాఖలైన అనర్హత పిటిషన్లను కొట్టివేస్తూ స్పీకర్ ఇచ్చిన తీర్పులను సవాల్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జీ జగదీశ్ రెడ్డి, కేపీ వివేకానంద, కే సంజయ్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సీహెచ్ ప్రభాకర్, పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ శాసనసభా పక్షనేత మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పలు పిటిషన్లపై హైకోర్టు విచారణ చేపట్టింది.
బీజేపీ, బీఆర్ఎస్ తరఫున సీనియర్ న్యాయవాదులు కే. వివేక్ రెడ్డి, గండ్ర మోహన్ రావు వాదనలు వినిపిస్తూ.. పిటిషన్లను కొట్టివేయడానికి స్పీకర్ పరిగణనలోకి తీసుకున్న ఆధారాలను పిటిషనర్లకు అందజేయలేదని చెప్పారు. ఒక పార్టీ నుంచి ఎన్నికైన వ్యక్తి అనంతరం మరో పార్టీ తరఫున లోక్సభ ఎన్నికల్లో పోటీ చేస్తే పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నట్లేనని పేర్కొన్నారు.
ఒక పార్టీ నుంచి ఎన్నికై మరో పార్టీ తరఫున పోటీ చేయడాన్ని రాజ్యాంగం నేరుగా నిషేధించకపోయినా, పార్టీ మారితే పదో షెడ్యూల్ కింద అనర్హత వర్తించే అవకాశం ఉందన్నారు. అనర్హతకు కేవలం వార్తా కథనాలనే ఆధారంగా తీసుకోలేదని, ఎన్నికల గెజిట్లు, అధికారిక పత్రాలు, నామినేషన్ సందర్భంగా సమర్పించిన ఫారం-26 అఫిడవిట్లను ఆధారాలుగా సమర్పించామని తెలిపారు. అయినప్పటికీ వార్తా కథనాల మూలాలు, రిపోర్టర్లు, ఎడిటర్ల వివరాలు ఇవ్వలేదని స్పీకర్ తీర్పులో పేర్కొనడం సరికాదన్నారు.
సదరు ఎమ్మెల్యేలు పార్లమెంట్, ఇతర ఎన్నికల్లో కాంగ్రెస్ కు అనుకూలంగా ప్రచారం చేశారని తెలిపారు. కాంగ్రెస్ జెండా కప్పుకుని ఏఐసీసీ అధికారిక కార్యక్రమాల్లో కూడా పాల్గొన్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు వీడియోలు, మీడియా కథనాలను కోర్టుకు సమర్పించారు.
మరోవైపు.. తమ నియోజకవర్గాల అభివృద్ధి కోసం మాత్రమే ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నారని ఫిరాయింపు ఎమ్మెల్యేల తరుపు న్యాయవాదులు వాదించారు. సీఎంను కలిసిన సమయంలో కప్పుకుంది కాంగ్రెస్ పార్టీ జెండా కాదని.. జాతీయ జెండా అని వివరణ ఇచ్చారు. తాము బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నామని స్పష్టం చేశారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం.. 2026, సెప్టెంబర్ 16న తుది తీర్పు వెల్లడించనుంది.

## పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్న మంత్రి వివేక్

మొదటిపేజీ తరువాయి
పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖ పరిధిలోకి తెచ్చిన నేపథ్యంలో విద్యార్థులు పలు సమస్యలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఒక్కో అంశంపై మంత్రి వారికి స్పష్టత ఇచ్చారు. ఫీజలు, పరీక్షలు, ఈసెట్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై వివరించారు. ఇప్పటికే చదువుతున్న విద్యార్థుల ప్రయోజనాలకు భంగం కలగదని భరోసా ఇచ్చారు. పాలిటెక్నిక్‌లలో అభివృద్ధి, ఆధునిక సాంకేతిక విద్యతో పాటు పరిశ్రమలతో అనుసంధానం, ఉపాధి కల్పనకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మంత్రి వివరించారు.

## రూ.108 కోట్లతో అంబేద్కర్ నాలెడ్జ్ టవర్

మొదటిపేజీ తరువాయి
పనులను త్వరగా ప్రారంభించాలని ఎస్సీ అభివృద్ధి శాఖ కమిషనర్‌ను సర్కారు ఆదేశించింది. టవర్ నిర్మాణానికి సంబంధించి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పలుమార్లు స్థలాన్ని పరిశీలించారు. ఎస్సీల ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు.

## మంత్రి కొండా సురేఖ సారీ చెప్పాలి: ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

మొదటిపేజీ తరువాయి
పార్టీలో ఉంటూ సీఎంపై విమర్శలుచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. పదేళ్ల పాలనలో రాష్ట్రానికి బీఆర్ ఎస్ పార్టీ చేసిందేమీ లేదన్నారు బీర్ల ఐలయ్య.. పేదలకోసం కష్టపడుతున్న సీఎంను విమర్శించడం సరికాదన్నారు. ప్రపంచ దేశాలతో పోటీ పడేలా తెలంగాణను సీఎం రేవంత్ రెడ్డి అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అమెరికా టూర్ ను బీజేపీ, బీఆర్ ఎస్ లే అడ్డుకున్నాయని ఆరోపించారు బీర్ల ఐలయ్య.

## అందుకే సీఎం రేవంత్ అమెరికా పర్యటనకు అనుమతివ్వలేదు: కేంద్రం

మొదటిపేజీ తరువాయి
"ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖుల విదేశీ పర్యటనలకు అనుమతి మంజూరు చేసే ముందు ఆ వివరాలను విదేశీ వ్యవహారాల శాఖ పరిశీలిస్తుంది. వారు చేసే పర్యటన.. నిర్వహిస్తున్న పదవి ఉద్దేశానికి తగినట్లుగా ఉండాలి. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి యూకే పర్యటనకు అనుమతి లభించింది. అమెరికా పర్యటన విషయంలో మాత్రం ఆ నిబంధనలను పాటించలేదు. అందుకే అనుమతి నిరాకరించాం" అని రణధీర్ జయస్వాల్ పేర్కొన్నారు.

# తెలంగాణలో గందరగోళం సృష్టించడంలో కేటీఆర్ నంబర్ వన్: ఎంపీ వంశీకృష్ణ



పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తు అంశంలో రాజకీయాలు చేస్తూ వారిని తప్పుదారి పట్టిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రస్తుతం పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థ, ఇంజినీరింగ్‌లో ఉన్నత విద్య అవకాశాలపై రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనలు జరుగుతున్న క్రమంలో స్పందించిన ఎంపీ వంశీకృష్ణ కేటీఆర్ పై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో గందరగోళం సృష్టించడంలో కేటీఆర్ నంబర్ వన్ అని అన్నారు.గతంలో గ్లోబరీనా సంస్థ వ్యవహారంలో విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడినప్పుడు కేటీఆర్ పాత్రపై ప్రశ్నలు తలెత్తాయని ఆరోపించారు. ఈ అంశంలో గతంలో పరస్పర రాజకీయ ఆరోపణలు, విమర్శలు కూడా కొనసాగాయి. విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం ఆందోళన చెందుతుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం వారి పక్షాన నిలిచి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తోందని స్పష్టం చేశారు. విద్యార్థులతో చర్చించి వారికి భరోసా కల్పిస్తున్నామని, వారి ఉద్యోగాలు, ఉన్నత విద్యా అవకాశాల విషయంలో ప్రభుత్వం పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తుందని తెలిపారు.
పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇంజినీరింగ్ చదివే అవకాశాలు కొనసాగుతాయని, వారి ఉన్నత విద్యా ప్రయాణానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీ వంశీకృష్ణ భరోసా ఇచ్చారు. సాంకేతిక విద్యను మరింత బలోపేతం చేసి తెలంగాణ యువతకు మెరుగైన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.
+వశీస్త్రతీఖుజూష్ట్రఅఎ=వటవతీవఅఎవ
విద్యార్థుల భవిష్యత్తును మరింత మెరుగుపరిచేందుకు రూ.800 కోట్ల అదనపు పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఉపాధి అవకాశాలు పెంచడం, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించడం, ఉన్నత విద్యలో విద్యార్థులకు మరింత అవకాశాలు కల్పించడం ద్వారా తెలంగాణను విద్యా, నైపుణ్య రంగాల్లో ముందంజలో నిలపాలని ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.
విద్యార్థుల సమస్యలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం మానుకోవాలని ప్రతిపక్షాలకు హితవు పలికిన ఎంపీ, విద్యార్థుల ఆందోళనలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణిస్తుందని స్పష్టం చేశారు. "విద్యార్థుల కోసం మేమున్నాం.. వారి భవిష్యత్తుకు పూర్తి భరోసా ఇస్తాం" అని అన్నారు ఎంపీ వంశీకృష్ణ

# మయన్మార్ లో బౌద్ధ పీఠం వైమానిక దాడి.. బాంబుల వర్షం కురిపించిన ఫైటర్ జైట్.. 14 మంది మృతి



నైపిడా: మయన్మార్ మధ్య ప్రాంతంలోని సాగైంగ్ రీజియన్‌లోని బౌద్ధ మఠంపై వైమానిక దాడి జరిగింది. ఫైటర్ జైట్ కురిపించిన బాంబుల వర్షానికి 14 మంది చనిపోగా.. 20 మందికి పైగా గాయపడ్డారు. మయన్మార్ సైన్యం ఈ దారుణానికి ఒడిగట్టింది. మయన్మార్ లోని రెండవ అతిపెద్ద నగరమైన మాండలేకు పశ్చిమాన దాదాపు 75 కిలోమీటర్ల దూరంలో ఉన్న మ్యాంగ్ టౌన్‌షిప్‌లోని స్వెల్ లే ఓహ్ గ్రామంలో శుక్రవారం (ఆగస్ట్ 21) ఉదయం 9 గంటల ప్రాంతంలో ఈ దాడి జరిగింది. బౌద్ధుల పవిత్ర కాలమైన లెంట్ సందర్భంగా స్థానిక మఠంలో వారం రోజుల ధ్యాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో దాదాపు 100 మందికి పైగా పాల్గొన్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం మయన్మార్ సైన్యం మఠంపై వైమానిక దాడి చేసింది. కేవలం 15 నిమిషాల వ్యవధిలోనే రెండు బాంబులు వేసింది. ఈ దాడుల్లో 14 మరణించగా.. 20 మందికి పైగా గాయపడ్డారు. బాంబుల ధాటికి మఠం పూర్తిగా నేలమట్టం అయ్యింది. అప్పటి వరకు యోగ, ధ్యాన వేడుకలతో సందడిగా ఉన్న మఠంతో వైమానిక దాడితో శ్మశానంలా మారిపోయింది.

**దాడులకు కారణమేంటంటే..?**
మయన్మార్‌లో 2021 ఫిబ్రవరిలో ప్రభుత్వాన్ని కూలగొట్టి సైన్యం అధికారాన్ని చేజిక్కించుకుంది. అప్పటి నుంచి సైన్యం, ప్రజాస్వామ్య అనుకూల శక్తులు పోరాటంతో మయన్మార్ అట్టుడికిపోతోంది. ఈ పోరాటంలో వైమానిక దాడులు సర్వ సాధారణంగా మారాయి. పౌరులు, ప్రతిపక్ష బృందాలను లక్ష్యంగా చేసుకుని సైన్యం దారుణాలకు తెగబడుతోంది. శుక్రవారం (ఆగస్ట్ 21) సాగైంగ్ రీజియన్‌లోని బౌద్ధ మఠంపై జరిగిన దాడి కూడా సైన్యం చేసిందే. ఈ ఘటనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణ పౌరులను లక్ష్యంగా చేసుకుని వైమానిక దాడులు చేయడంతో మయన్మార్ సైన్యంపై పలు దేశాలు మండిపడుతున్నాయి.

# సాగర్ రోడ్డు -- బీఎన్ రెడ్డి ఫ్లైఓవర్ కు లైన్ క్లియర్.. విజయవాడ హైవేపై ట్రాఫిక్ కష్టాలకు చెక్




హైదరాబాద్ సిటీలో మరో ఫ్లైఓవర్ సిద్ధం కానుంది. సాగర్ రోడ్డు నుంచి బీఎన్ రెడ్డి వరకు కొత్త ఫ్లైఓవర్ కు లైన్ క్లియర్ అయ్యింది. 3.2 కిలోమీటర్ల పొడవు, 6 లేన్లలో నిర్మించనున్న ఫ్లైఓవర్ కు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో విజయవాడ హైవేపై ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. సాగర్ రోడ్డు నుంచి బీఎన్ రెడ్డి వరకు ఉండే ఈ ఫ్లైఓవర్ హస్తినాపురం మీదుగా వెళ్లనుంది. ఎల్బీనగర్, బీఎన్ రెడ్డి నగర్ కారిడార్ లో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండటంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే సిగ్నల్ దగ్గర ఎదురు చూపులు, దూరభారాలు తగ్గనున్నాయి.
ఎల్బీనగర్--హస్తినాపురం--బీఎన్ రెడ్డి రూట్ హైదరాబాద్ ఈస్ట్ లో బిజీ రూట్లలో ఇదొకటి. ఇన్నర్ రింగ్ రోడ్డు, విజయవాడ నేషనల్ హైవే కలిసే ప్రాంతంలో భారీ ట్రాఫిక్ ఏర్పడుతుంటుంది.
మీర్ పేట్, బడంగ్ పేట్, వనస్థలీపురం, ఎల్బీ నగర్ రూట్లలో వచ్చే వారు ట్రాఫిక్ ఇబ్బందులకు గురవుతుంటారు. ఉదయం, సాయంత్రం అరగంట నుంచి 45 నిమిషాల వరకు సాగర్ రింగ్ రోడ్డు దగ్గర ట్రాఫిక్ లో ఇరుక్కుపోవాల్సి వస్తుంది. అందుకే ఈ రూట్లో ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని ఎప్పటి నుంచో వాహనదారుల నుంచి డిమాండ్ ఉంది.
ఈ రూట్ క్లియర్ అయితే సిగ్నల్స్ అవసరం లేకుండా బైపాస్ మీదుగా వాహనదారులు ఎల్బీ నగర్ మీదుగా బీఎన్ రెడ్డి వెళ్లవచ్చు. అదే విధంగా నాగార్జున సాగర్ హైవే, విజయవాడ హైవే లో ఎలాంటి జామ్ లేకుండా వెళ్లవచ్చు. అంబులెన్స్ లు, బస్సులకు క్లియర్ చానెల్ దొరకడంతో.. ఇబ్బందులు ఉండవు. అదే విధంగా ట్రాఫిక్ తగ్గటం, దూరం తగ్గటంతో ఫ్యుయెల్ వినియోగం కూడా తగ్గుతుందని చెబుతున్నారు.
సాగర్ రోడ్ -- బీఎన్ రెడ్డి కారిడార్ తో స్థానికంగా రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందటంతో పాటు కమర్షియల్ గా, వ్యాపార అవకాశాలు పెరగుతాయని భావిస్తున్నారు.

# పార్టీని వీక్ చేస్తున్న కొండా సురేఖను మంత్రిగా తొలగించాలి : వేముల వీరేశం



పదేళ్ల బీఆర్ఎస్ పార్టీ రాక్షస పాలనను ఎదిరించి.. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావటంలో సీఎం రేవంత్ రెడ్డి కృషి ఎంతో ఉందని.. అలాంటి సీఎంను.. కాంగ్రెస్ పార్టీని చులకన చేస్తూ.. పార్టీకి నష్టం కలిగించే విధంగా వ్యాఖ్యలు చేస్తున్న కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు ప్రభుత్వ విప్ వేముల వీరేశం. సీఎం రేవంత్ రెడ్డి వైఖరిపై..వ్యక్తిగతంగా విమర్శలు చేసిన మంత్రి కొండా సురేఖ కుమార్తె అంశంపై హైదరాబాద్ గాంధీభవన్ లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు భేటీ అయ్యారు. స్థానికనగర గైడ్‌లను పరిశీలించడం
కుమార్తె చేసిన వ్యాఖ్యలతో సంబంధం లేదు అని కొండా సురేఖ అంటున్నారని.. తల్లికి తెలియకుండా బిడ్డ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుందంటే ఎవరూ నమ్మరంటూ చెప్పుకొచ్చారు వేముల వీరేశం. సీఎం రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలకు.. మంత్రి కొండా సురేఖ బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారాయన. ఏమైనా సమస్యలు ఉంటే పార్టీ అంతర్గతంగా చర్చించి పరిష్కరించుకోవాలని.. అలా కాకుండా బహిరంగ వేదికలపై విమర్శలు, ఆరోపణలు చేయటం ఏంటని నిలదీశారు విప్ వేముల వీరేశం.
పదవిలో ఉంటూ సీఎంను విమర్శిస్తాను అంటే ఊరుకోం అని హెచ్చరించిన ఆయన.. కొండా సురేఖ వ్యాఖ్యలు ఎప్పుడూ పార్టీకి నష్టమే చేస్తున్నాయన్నారు. పనిగట్టుకుని ప్రభుత్వం, పార్టీపై విమర్శలు చేస్తున్నారంటూ కొండా సురేఖపై ఆగ్రహం వ్యక్తం చేశారు ప్రభుత్వ విప్ వేముల వీరేశం. పార్టీ క్రమ శిక్షణకు కట్టుబడి ఉండాలని.. గీత దాటితే ఊరుకునేది లేదని.. AICC చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారాయన. సొంత పార్టీ నేతలు, ఎమ్మెల్యేలపైనే ఎంత అంటే అంత మాటలు అనటం ఏంటని ప్రశ్నించారాయన.

## హత్య కేసులో దోషి..
### 105 ఏళ్ల వృద్ధుడికి 'సుప్రీం' ఉపశమనం

ఓ హత్య కేసులో దోషిగా తేలి శిక్ష అనుభవిస్తున్న 105 ఏళ్ల వృద్ధుడికి సుప్రీం కోర్టు ఉపశమనం కల్పించింది. ఇదివరకు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌నే అంతిమ నిర్ణయంగా పేర్కొంది. గతంలో విధించిన యావజ్జీవ కారాగార శిక్ష పూర్తి కాకపోయినా అతడిని తిరిగి అదుపులోకి తీసుకోవద్దని.. ఇక నుంచి ఆయన స్వేచ్ఛగా జీవించవచ్చని స్పష్టం చేసింది.
పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా జిల్లాకు చెందిన రసిక్ చంద్ర మోండల్ (105) దాదాపు నలభై ఏళ్ల క్రితం ఓ హత్య కేసులో నిందితుడు. 1994లో అతడిని న్యాయస్థానం దోషిగా తేల్చి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఈ శిక్షను తొలుత కలకత్తా హైకోర్టులో సవాల్ చేయగా చేయగా అక్కడ చుక్కెదురైంది. అనంతరం సుప్రీం కోర్టుకు వెళ్లినప్పటికీ ఉపశమనం లభించలేదు.
అయితే, తనకు 99ఏళ్ల వయసు అని, వృద్ధాప్య సంబంధిత సమస్యలతో బాధపడుతున్నానని పేర్కొంటూ మోండల్ మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ముందస్తు విడుదల చేయాలని కోరుతూ 2020లో పిటిషన్ దాఖలు చేశారు. అతడి పిటిషన్‌ను పరిశీలించిన సర్వోన్నత న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వ స్పందనను కోరింది. చివరకు 2024 నవంబర్‌లో మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. తాజాగా ఇదే కేసును విచారించిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం.. పిటిషనర్ వయసును పరిగణనలోకి తీసుకొని ఈ కేసును మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఇంకా అతడికి ఏమైనా శిక్ష మిగిలి ఉన్నట్లయితే దానిని రద్దు చేస్తున్నట్లు తెలిపింది.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం ఆగస్ట్ 22, 2026

# అభివృద్ధికి నిధులు కోరిన కోరుట్ల మున్సిపల్ చైర్పర్సన్



**గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**
తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగారావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు సూచనతో, కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్లు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి కోరుట్ల పట్టణ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ వినతికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు మున్సిపల్ చైర్పర్సన్ తెలిపారు.



# వృద్ధులను జాతీయ సంపదగా గుర్తించాలి

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఘట్కేసర్ లోని కొర్రెముల సుప్రభాత్ టౌన్‌షిప్‌లో డెమొక్రటిక్ సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ మాట్లాడుతూ, వృద్ధులను దేశానికి భారంగా కాకుండా జాతీయ సంపదగా గుర్తించాలని, వారి హక్కులు, ఆరోగ్యం, ఆర్థిక భద్రతకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమనికి అసోసియేషన్ ఉపాధ్యక్షులు బంగారి రాజయ్య అధ్యక్షత వహించారు.



# తిరంగా ర్యాలీపై కేసు నమోదు అక్రమం: లడ్డు యాదవ్

**కరపత్రం ప్రతినిది అఫ్జల్‌గంజ్, ఆగస్టు 21**
స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన తిరంగా ర్యాలీపై అఫ్జల్‌గంజ్ పోలీసులు తనపై కేసు నమోదు చేయడం అన్యాయమని భగత్‌సింగ్ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు లడ్డు యాదవ్ ఆరోపించారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.బేగంబజార్ ఛత్రి నుంచి భగత్‌సింగ్ యువసేన ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించామని, దేశభక్తి కార్యక్రమాన్ని నేరంగా పరిగణిస్తూ కేసులు నమోదు చేయడం సమంజసం కాదని అన్నారు. గత ఏడాది కూడా ఇదే తరహాలో శాయినాథ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తనపై నమోదు చేసిన కేసును నాంపల్లి 16వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు కొట్టివేసిందని గుర్తు చేశారు. దేశం కోసం నిర్వహించిన ర్యాలీపై కేసు నమోదు చేయడాన్ని కోర్టు తప్పుబట్టిందని చెప్పారు. ప్రస్తుత కేసు కూడా న్యాయస్థానంలో నిలవదని, ఇదే విధంగా కొట్టివేయబడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. యువతను భయభ్రాంతులకు గురిచేయడం, కక్షసాధింపు చర్యల్లో భాగంగానే పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

# మెట్‌పల్లిలో త్రిశక్తి అమ్మవార్లకు పంచామృత అభిషేకం

**గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**



మెట్‌పల్లి పట్టణంలో వరలక్ష్మి వ్రతం సందర్భంగా మెట్‌పల్లి పట్టణంలో శుక్రవారం త్రిశక్తి దేవాలయంలో త్రిశక్తి అమ్మవార్లకు పంచామృత అభిషేకములు అర్చనలు జరిగిన అనంతరం సామూహిక కుకుమార్చనలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాద కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ధ్యావన పెల్లి రాజారాం కమిటీ సభ్యులు,మహిళలు పాల్గొన్నారు

# సిరికొండ హిందూ యువసేన నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**



గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కథలాపూర్ మండలం సిరికొండ గ్రామంలో శుక్రవారం రోజున హిందూ యువసేన(రుద్రసేన ) యూత్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూత్ గౌరవాధ్యక్షునిగా కాల గిరి రాజేందర్, అధ్యక్షునిగా నిమ్మ రూపేష్, ఉపాధ్యక్షులు కందరి అభిలాష్, ప్రధాన కార్యదర్శి కుంట హర్షవర్ధన్, కోడిపేల్లి అనిల్ రెడ్డి లు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులు తమను ఎన్నుకున్న యూత్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం తో పాటు, భవిష్యత్తులో అనేక ధార్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

# కోరుట్లలో వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



**గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**
కోరుట్ల పట్టణంలో శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి మాత దేవాలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుల పర్యవేక్షణలో ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. మహిళలు అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించి, సామూహికంగా వ్రతాలు చేశారు. అన్నప్రసాద వితరణ కూడా జరిగింది.

# మేడ్చల్ లో నీట్ -పీజీ పరీక్షలు హాజరుకానున్న 7,375 మంది విద్యార్థులు



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ జిల్లా ప్రాంతంలో ఆగస్టు 30వ తేదీన నీట్ -పీజీ 2026 పరీక్ష నిర్వహిస్తున్నట్లు మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 19 పరీక్ష కేంద్రాల్లో 7,357 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జదీ విధానంలో పరీక్ష జరుగుతుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో పటిష్ట బందోబస్తు, ట్రాఫిక్, వైద్య , విద్యుత్, త్రాగునీరు, అన్ని రకాల సౌకర్యాలు విద్యార్థులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

# రోస్టర్ విధానంపై మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దాలి

- ఆగస్టు 31న నిర్వహించే 'ఛలో సెక్రటేరియట్' కార్యక్రమాన్ని విజయవంతం చేయండి: పనికల శ్రీనివాస్
- జాతీయ మాల మహానాడు హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, దళితరత్న పనికల శ్రీనివాస్

**కరపత్రం ప్రతినిది హనుమకొండ, ఆగస్టు 21**
రోస్టర్ విధానం కారణంగా విద్య, ఉద్యోగ అవకాశాల్లో మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని వెంటనే సరిదిద్దాలని జాతీయ మాల మహానాడు హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, దళితరత్న పనికల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జాతీయ మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో ఈ నెల ఆగస్టు 31న నిర్వహించే "ఛలో సెక్రటేరియట్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ జిల్లాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ.. మాల విద్యార్థులు, నిరుద్యోగ యువత, ఉద్యోగులు ఎదుర్కొంటున్న



సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల మాలలకు విద్యా ప్రవేశాలు, ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో తీవ్ర నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల భవిష్యత్తును కాపాడుకోవాలంటే ప్రతి మాల కుటుంబం ఉద్యమంలో భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. హనుమకొండ జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామం, మండలం నుంచి భారీ సంఖ్యలో ప్రజలు ఆగస్టు 31న సెక్రటేరియట్‌కు తరలిరావాలని పిలుపు నిచ్చారు. అలాగే సోషల్ మీడియా వేదికల ద్వారా ఉద్యమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని యువతకు సూచించారు.

ప్రధాన డిమాండ్లు

- రోస్టర్ విధానంలో మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని వెంటనే సరిదిద్దాలి.
- ఇరవై లోపు రెండు రోస్టర్ పాయింట్లు కేటాయించాలి.
- విద్య, ఉద్యోగాలు, పదోన్నతుల్లో మాలలకు సముచిత న్యాయం చేయాలి.
- మాల విద్యార్థులు, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం విధానాలను మార్చాలి.
- మాల సమాజం ఐక్యంగా ఉద్యమంలో పాల్గొని తమ హక్కులను సాధించుకోవాలి. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు బొల్లం రామ్‌కుమార్, యువజన అధ్యక్షుడు ఉసిల్ల ఉదయ్, గౌరవ సలహాదారు సాధు కుమారస్వామి, రాష్ట్ర నాయకుడు సంపతి రఘు, వరంగల్ జిల్లా నాయకుడు శీదుల విష్ణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జఫర్‌గడ్‌లో డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ

- పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- సన్నబియ్యం పంపిణీలో తెలంగాణ దేశానికే ఆదర్శం -- బీఆర్ఎస్ అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని పిలుపు

**కరపత్రం ప్రతినిది బ్యూరో, ఆగస్టు 21**
స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని జఫర్‌గడ్ మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యాధునిక భద్రతా ప్రమాణాలతో రూపొందించిన కొత్త డిజిటల్ రేషన్ కార్డులను మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుని దేశానికే ఆదర్శంగా నిలిచే పథకాలను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో కోటి ఆరు లక్షల రేషన్ కార్డుల ద్వారా మూడు కోట్ల పది లక్షల మందికి ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున ఉచిత సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం రూ.13,800 కోట్లను



వెచ్చిస్తోందని పేర్కొన్నారు.
రాష్ట్ర ప్రభుత్వం జారీ చేస్తున్న డిజిటల్ రేషన్ కార్డులు అత్యున్నత భద్రతా ప్రమాణాలతో రూపొందించబడినవని, లబ్ధిదారులకు మరింత పారదర్శకంగా సేవలు అందేలా వీటిని అందిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులపై ఎమ్మెల్యే తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం, తనపై కావాలనే అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. సామాజిక మాధ్యమాలు, కొన్ని యూట్యూబ్ ఛానళ్ల ద్వారా తప్పుడు వార్తలను ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి విష ప్రచారాలకు స్థానం లేదని, ప్రజలు వాస్తవాలను గుర్తించాలని కోరారు. తన 35 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎలాంటి అవినీతి ఆరోపణలకు తావివ్వలేదని పేర్కొన్న



కడియం శ్రీహరి, ప్రజలు నిజాయితీగా పనిచేసే నాయకులను ఆదరించాలని సూచించారు. సన్న బియ్యం పంపిణీ విషయంలో తెలంగాణ దేశానికి మార్గదర్శకంగా నిలిచిందని, ఇతర రాష్ట్రాలు కూడా ఈ విధానాన్ని ఆదర్శంగా తీసుకుంటున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం దొడ్డు బియ్యం అందిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తోందని తెలిపారు. పేదల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే దేశ వ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మునిగాల సరోజన, డివిజన్ అధ్యక్షుడు బిక్షపతి, మున్సిపల్ అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బార్ కౌన్సిల్ స్వతంత్రతను కాపాడాలి' దేశ వ్యాప్త నిరసనల్లో భాగంగా వరంగల్‌లో న్యాయవాదుల ఆందోళన

- బీసీఐపై అసంతృప్తి.. చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా రాజీనామాకు న్యాయవాదుల డిమాండ్
- వరంగల్ కోర్టు ఎదుట నిరసన.. బార్ కౌన్సిల్ స్వతంత్రతను కాపాడాలని పిలుపు

**కరపత్రం ప్రతినిది బ్యూరో, ఆగస్టు 21**
దేశ అత్యున్నత న్యాయవాదుల నియంత్రణ సంస్థ అయిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన న్యాయవాదులు శుక్రవారం వరంగల్ కోర్టు ప్రధాన ద్వారం ఎదుట ధర్నా నిర్వహించారు. బీసీఐ చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ఈ నిరసన దేశ వ్యాప్తంగా ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ పిలుపులో భాగంగా జరిగింది. నిరసనలో పాల్గొన్న న్యాయవాద సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాజకీయ ప్రభావాలకు అతీతంగా, న్యాయవాదుల హక్కులు, వృత్తి స్వాతంత్ర్యం, రాజ్యాంగ విలువలను పరిరక్షించే సంస్థగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం సంస్థ



పనితీరు ఆ లక్ష్యాలకు భిన్నంగా సాగుతోందని ఆరోపించారు.
ఎఐఎల్యూ రాష్ట్ర కోశాధికారి వెన్నంశెట్టి వేణుగోపాల్ రావు మాట్లాడుతూ.. నల్సార్ విశ్వవిద్యాలయానికి సంబంధించిన పరిణామాలు, బీసీఐ తీసుకున్న కొన్ని నిర్ణయాలు న్యాయవాద వృత్తిపై ప్రతికూల ప్రభావం చూపాయని అన్నారు. వ్యక్తిగత నిర్ణయాలు, ఏకపక్ష వైఖరితో సంస్థ గౌరవం దెబ్బతింటోందని పేర్కొన్నారు.
ఐఎల్పీఏ నాయకులు తీగల జీవన్ గౌడ్, సాయిని నరేందర్ మాట్లాడుతూ.. అడ్వకేట్స్ యాక్ట్--1961 ప్రకారం ఏర్పాటైన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అన్ని వర్గాల న్యాయవాదులకు సమానంగా ప్రాతినిధ్యం వహించాల్సిన



బాధ్యత ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా సంస్థ వ్యవహరించాలని, న్యాయవాదుల విశ్వాసాన్ని పునరుద్ధరించే చర్యలు తీసుకోవాలని కోరారు.
మనన్ కుమార్ మిశ్రా రాజీనామా చేసే వరకు దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఈ నిరసనలో ఎఐఎల్యూ రాష్ట్ర కమిటీ సభ్యులు సారంపల్లి మధుసూదన్ రెడ్డి, జన్ను పద్మ, పెండ్యాల అనిల్, జన్ను ప్రభాకర్, హనుమకొండ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రఘుపతి, ఐఏఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీమనాథం శ్రీనివాస్, సాయి నరేందర్, కొత్తపల్లి చిరంజీవి, చంద్రమౌళి, మేడారపు రంజిత్, పాము రమేష్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో న్యాయవాదులు, వివిధ న్యాయవాద సంఘాల నాయకులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొని నిరసనకు మద్దతు తెలిపారు.

# వయోవృద్ధుల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా హనుమకొండలో అవగాహన సదస్సు

**కరపత్రం ప్రతినిధి హనుమకొండ, ఆగస్టు 21**




ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ), హనుమకొండ ఆధ్వర్యంలో బన్ను ఆరోగ్య సేవా సొసైటీ నిర్వహిస్తున్న సీనియర్ సిటిజన్ డే కేర్ సెంటర్‌లో వయోవృద్ధుల హక్కులు, చట్టపరమైన రక్షణలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీ జి. రామలింగం మాట్లాడుతూ, వయోవృద్ధుల పట్ల కుటుంబ సభ్యులు, సమాజం గౌరవం, ఆదరణ, బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. వయోవృద్ధుల హక్కుల పరిరక్షణకు చట్టం కల్పించిన రక్షణలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, అవసరమైన సందర్భాల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు.

సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు సభ్యురాలు డా. కె. అనితా రెడ్డి మాట్లాడుతూ, వయోవృద్ధులకు సంబంధించిన చట్టాలు, వారి హక్కులు, సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉన్న న్యాయ వేదికలపై వివరించారు.

హనుమకొండ బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శ్రీ వి. నరేందర్ మాట్లాడుతూ, న్యాయ సహాయం అవసరమైనప్పుడు న్యాయవాదుల సేవలను ఎలా వినియోగించుకోవాలో వివరించగా, ఎఫ్ఏసీ జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి ఎం. విశ్వజ ప్రభుత్వం అమలు చేస్తున్న వయోవృద్ధుల సంక్షేమ పథకాలు, అందుబాటులో ఉన్న సేవలు, సౌకర్యాలపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు యెన్. నర్సయ్య, కే. దామోదర్, కార్యదర్శి టి. యుగేందర్, సీనియర్ సిటిజన్స్ ఫోరం కార్యదర్శి వి. దేవాచార్య, ఎఫ్.ఆర్.ఓ రవికృష్ణ, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు, వయోవృద్ధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ స్థానిక విద్యార్థులకే ఎంబీబీఎస్ సీట్లు కేటాయించాలి: టిఆర్ఎస్ చీఫ్ కవిత

- జీవో-150 రద్దు చేసి పాత స్థానికత నిబంధనలు అమలు చేయాలని డిమాండ్
- ఢిల్లీలో స్పందించిన కాంగ్రెస్ అగ్రనేత తెలంగాణ ఘటనలపై కూడా స్పందించాలని డిమాండ్

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 21**






తెలంగాణలో ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపులో రాష్ట్ర స్థానిక విద్యార్థులకు ప్రాధాన్యం కల్పించాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. 2024లో తీసుకొచ్చిన జీవో నం.150 కారణంగా ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో ఎంబీబీఎస్ సీట్లు పొందుతున్నారని, దీంతో తెలంగాణ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని కవిత ఆరోపించారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో నీట్‌లో ర్యాంకులు సాధించిన తెలంగాణ విద్యార్థుల తల్లిదండ్రులు కవితను కలిసి తమ ఆందోళనలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కవిత, మరో వారం రోజుల్లో ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపు ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున తెలంగాణ విద్యార్థులకు నష్టం కలగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

జీవో నం.150 ప్రకారం 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు నాలుగేళ్లు తెలంగాణలో చదివితే స్థానికత వర్తించే విధానం అమలులో ఉందని, దీని వల్ల ఇతర రాష్ట్రాల విద్యార్థులు కూడా తెలంగాణలో సీట్లు పొందుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఫలితంగా ప్రతి ఏడాది సుమారు 1,500 నుంచి 2,000 వరకు ఎంబీబీఎస్ సీట్లు ఇతర రాష్ట్రాల విద్యార్థులకు దక్కుతున్నాయని, అదే సంఖ్యలో తెలంగాణ విద్యార్థులు అవకాశాలు కోల్పోతున్నారని అన్నారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు కనీసం ఏడేళ్లు చదివిన రాష్ట్రానికే స్థానికత వర్తించే పాత నిబంధనలను పునరుద్ధరించాలని ఆమె సూచించారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి జీవో నం.150ను పూర్తిగా రద్దు చేసి తెలంగాణ విద్యార్థులకు న్యాయం చేసే విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నీట్ విధానం కారణంగా ఇప్పటికే రాష్ట్ర విద్యార్థులు 15 శాతం సీట్లు కోల్పోతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో జీవో-150 మరింత నష్టాన్ని కలిగిస్తోందని కవిత అభిప్రాయపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ అంశంపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని, విదేశీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

రాహుల్ గాంధీ.. తెలంగాణలో విద్యార్థులపై పోలీసుల వ్యవహారంపై మౌనమెందుకు?:కల్వకుంట్ల కవిత ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల వ్యవహారాన్ని ఖండించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, తెలంగాణలో విద్యార్థులపై చోటుచేసుకున్న పోలీసు చర్యల విషయంలో ఎందుకు స్పందించడం లేదని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. శుక్రవారం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించిన పార్టీ చీఫ్ కవిత, ఢిల్లీలో విద్యార్థులకు మద్దతుగా రాహుల్ గాంధీ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొంటూనే, కాంగ్రెస్ పాలిత తెలంగాణలో విద్యార్థులపై జరిగిన ఘటనలపై కూడా అదే స్థాయిలో స్పందించాలని కోరారు. ఈ నెల 19న మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ వద్ద జీవో-97కు వ్యతిరేకంగా పాలిటెక్నిక్ విద్యార్థులు నిర్వహించిన శాంతియుత నిరసన సందర్భంగా ఇద్దరు విద్యార్థులను స్థానిక సీఐ గొంతు పట్టుకుని వెనక్కి నెట్టిన ఘటనను టిఆర్ఎస్ చీఫ్ కవిత ప్రస్తావించారు. అలాంటి సంఘటనలపై కాంగ్రెస్ అధిష్ఠానం మౌనం పాటించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఢిల్లీలో ఒక విధానం, తెలంగాణలో మరో విధానం ఎందుకని ప్రశ్నించిన కవిత, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో విద్యార్థుల హక్కుల పరిరక్షణ విషయంలో కూడా సమాన దృష్టి ఉండాలని అన్నారు. తెలంగాణలో విద్యార్థులను నేరస్తుల్లా చూడకుండా ప్రభుత్వం వ్యవహరించాలని, ఈ ఘటనలపై రాహుల్ గాంధీ స్పందించి తగిన చర్యలు తీసుకునేలా చూడాలని కవిత డిమాండ్ చేశారు.

# 11వ తెలంగాణ మాస్టర్ స్విమ్మింగ్‌లో అంబర్‌పేట్ క్రీడాకారుల సత్తా

- ఇంద్రసేన యాదవ్‌కు 5 స్వర్ణాలు.. రాష్ట్ర స్థాయిలో తొలి ర్యాంక్

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు 21**



జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో అంబర్‌పేట్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్విమ్మింగ్ పూల్‌లో ఆగస్టు 15న నిర్వహించిన 11వ తెలంగాణ మాస్టర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ --2026లో అంబర్‌పేట్ క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచారు. ఇంద్రసేన యాదవ్ ఐదు స్వర్ణ పతకాలు సాధించి రాష్ట్ర స్థాయిలో తొలి ర్యాంక్‌ను కైవసం చేసుకున్నారు. వి. రమణ నాలుగు పతకాలు, రాజ్‌కుమార్ సురానా నాలుగు స్వర్ణాలు, ఒక రజత పతకం, మధు మూడు స్వర్ణాలు, రెండు రజత పతకాలు, మురళీధర్ రెడ్డి రెండు రజత పతకాలు సాధించి జట్టు విజయానికి తోడ్పడ్డారు. విజేతలను అంబర్‌పేట్ మాజీ కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జి. మల్లేష్ యాదవ్, రమేష్ గౌడ్, ఎం. శంకర్ ముదిరాజ్, అమృత్ రెడ్డి, శ్రీనివాస్ బాబా, రాజశేఖర్ రెడ్డి, శివ, ప్రభాకర్ యాదవ్, జగదీశ్వర్ రెడ్డి, సూర్య నారాయణ తదితరులు పాల్గొన్నారు. క్రీడాకారుల విజయానికి కోచ్‌లు కె. సురేష్, ప్రశాంత్, సుదీర్, కృష్ణ, గిరి కృషి చేసినందుకు నిర్వాహకులు అభినందనలు తెలిపారు.

# వికలాంగుల వాయిస్ మాస పత్రిక 12వ వార్షికోత్సవ ఉత్సవాలు

- రాజ్యాంగ హక్కులు - భావప్రకటన స్వేచ్ఛ - సవాళు అనే అంశంపై సెమినార్ పోస్టర్ ఆవిష్కరణ
- కె వెంకట్ వికలాంగుల వాయిస్ మాస పత్రిక మేనేజర్

**కరపత్రం ప్రతినిధి ఆగస్టు 21,మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా.**



వికలాంగుల వాయిస్ మాస పత్రిక 12వ వార్షికోత్సవ ఉత్సవాలు ఆగష్టు 26 నాడు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నామని వికలాంగుల వాయిస్ మాస పత్రిక గౌరవ సలహాదారులు పి ఉమ్మర్ ఖాన్ తెలిపారు. ఈ రోజు ఆగష్టు 26న హైదరాబాద్లో జరిగే వార్షికోత్సవ ఉత్సవాలను పోస్టర్ ను వికలాంగుల వాయిస్ ఎడిటర్ యం అడివయ్య, మేనేజర్ కె వెంకట్,ఎన్ పి ఆర్ డి రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్, హెచ్ కె రిహబిలిషన్ డైరెక్టర్స్ అర్ముగాం, శశిధర్ రెడ్డి లతో కలిసి హెలెన్ కెల్లర్ విద్యా సంస్థల ప్రాంగణంలో అయన ఆవిష్కరణ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో వికలాంగులలో చైతన్యం తేవడానికి నడుస్తున్న ఏకైక మాస పత్రిక వికలాంగుల వాయిస్ మాస పత్రిక అని, గత 11 ఏండ్లుగా పత్రిక నిరంతరాయంగా నడుపుతున్నామని తెలిపారు.పత్రిక వికలాంగుల పోరాటాలకు దిక్షుచిగా నిలుస్తుందని అన్నారు. హక్కుల కోసం వికలాంగులు చేస్తున్న పోరాటాలకు మార్గదర్శిగా వికలాంగుల వాయిస్ ఉందని అన్నారు. చట్టాలు, సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సమాచారం వికలాంగులలోకి తీసుకువెళ్ళడానికి పత్రిక కృషి చేస్తుందని అన్నారు.గ్రామీణ ప్రాంతంలోని వికలాంగులను చైతన్యం చేయడానికి పత్రిక కృషి చేస్తుందని అన్నారు. వికలాంగుల వాయిస్ మాస పత్రిక వికలాంగుల చేతిలో ఆయుధంగా నిలుస్తుందని అన్నారు.ఆగష్టు 26 నాడు మధ్యాహ్నం 1.00 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో పత్రిక 12వ వార్షికోత్సవ ఉత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# కొల్లూరు చెరువుల కాలుష్యంపై ఎంపీ ఈటల ఆందోళన

- పరిశ్రమల వ్యర్థాలతో చేపలు, పశువులు మృతి.. శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 21**





మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని కొల్లూరు గ్రామంలో పారిశ్రామిక కంపెనీల వ్యర్థాలతో చెరువులు, కుంటలు తీవ్రంగా కలుషితమై చేపలు, పశువులు, వన్యప్రాణులు మృతి చెందుతున్నాయనే సమాచారం మేరకు ఎంపీ ఈటల రాజేందర్ శుక్రవారం గ్రామాన్ని సందర్శించారు. చెరువు వద్ద పరిస్థితిని పరిశీలించి స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో మాట్లాడి పరిశ్రమల నుంచి వచ్చే రసాయన వ్యర్థాలు చెరువుల్లోకి చేరకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశ్రమలు తప్పనిసరిగా ట్రీట్మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేసి కలుషిత నీటిని బయటకు విడుదల కాకుండా చూడాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. జీడిమెట్ల కెమికల్ ఇండస్ట్రీ ప్రాంతం, జీనోమ్ వ్యాలీ, తుర్కపల్లి, జవహర్‌నగర్ డంప్‌యార్డ్ నుంచి వచ్చే మురుగునీరు, దుర్వాసనతో ప్రజల జీవనం దుర్భరంగా మారిందన్నారు. కలుషిత వాతావరణంతో చర్మవ్యాధులు, శ్వాసకోశ సమస్యలు, గర్భస్రావాలు, క్యాన్సర్ వంటి ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, పశుసంపద కూడా తీవ్రంగా ప్రభావితమవుతోందని పేర్కొన్నారు. కొల్లూరు గ్రామంలో జీనోమ్ వ్యాలీ నుంచి వచ్చిన రసాయన వ్యర్థాల వల్ల రూ.15 లక్షల విలువైన చేపపిల్లలు మృతి చెందాయని, అవి పెరిగితే సుమారు రూ.కోటి విలువైన ఆదాయం వచ్చేదని తెలిపారు. ఈ చేపల పెంపకంపై ఆధారపడిన 250 కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని అన్నారు. కొన్ని ఫార్మా కంపెనీలు రసాయన వ్యర్థాలను భూగర్భంలోకి పంపించడం, డ్రైనేజీల్లో విడుదల చేయడం వల్ల చెరువుల్లో చేపలు, వాటిని తిన్న పక్షులు, నీరు తాగిన పశువులు చనిపోతున్నాయని ఆరోపించారు. కాలుష్య నియంత్రణ మండలి నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించిన ఆయన, అవసరమైతే ఢిల్లీ వరకు ఫిర్యాదు చేసి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం సాధించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# జమ్మికుంట లో ఘనంగా గెల్లు శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలు




**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్, ఆగస్టు 21**

బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని జమ్మికుంటలో బీఆర్ఎస్వీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్పందన అనాథ ఆశ్రమంలో కేక్ కట్ చేసి, ఆశ్రమంలోని చిన్నారులకు పండ్లు పంపిణీ చేసి గెల్లు శ్రీనివాస్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థి సంఘము నాయకులు మాట్లాడుతూ..విద్యార్థులు, యువత సమస్యల పరిష్కారం కోసం గెల్లు శ్రీనివాస్ యాదవ్ చేస్తున్న కృషిని నాయకులు కొనియాడారు. బీఆర్ఎస్వీని బలోపేతం చేయడంతో పాటు యువతను ఐక్యంగా ముందుకు నడిపించడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ ప్రజలకు, యువతకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో ఆయన మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని నాయకులు, కార్యకర్తలు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ టౌన్ అధ్యక్షుడు కొమ్ము నరేష్, జవ్వాజి అనిల్, నల్లగాష హరీష్ యాదవ్, నరేంగుల శివ యాదవ్, చింతల కౌశిక్‌తో పాటు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 21**



బోడుప్పల్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించిన మల్కాజిగిరి ఎంపీ మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని బోడుప్పల్‌లో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్ రెడ్డి, బోడుప్పల్ మాజీ కార్పొరేటర్ సామల పవన్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ బొట్టు వెంకటేష్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సంధ్య రెడ్డి, సీనియర్ నాయకులు వేణుగోపాల్, మహిపాల్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 26న వరంగల్‌లో ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం ఊరేగింపు

- భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకుల పిలుపు

**కరపత్రం ప్రతినిధి వరంగల్,ఆగస్టు 21**



గులామాన్ రహ్మతుల్ లిల్ ఆలమీన్ సంస్థ ఆధ్వర్యంలో ప్రవక్త ముహమ్మద్ జన్మదినోత్సవం సందర్భంగా ఈ నెల 26న ముహమ్మద్ ఊరేగింపు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం జుహర్ నమాజ్ అనంతరం మండి బజార్ గౌసియా చౌక్ నుంచి ఊరేగింపు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఊరేగింపునకు ఉర్స్ జాగీర్‌లోని హజ్రత్ మషాఖ్ రబ్బానీ(రహ్మతుల్లాహి అలైహి)బర్గా సజ్జాదా నషీన్ హజ్రత్ సయ్యద్ షా హైదర్ హిలాల్ ఉద్దీన్ ఖాద్రీ(నవీద్ బాబా సాహెబ్)అధ్యక్షత వహించనున్నారు.హజ్రత్ సయ్యద్ షా అలీ ఖాద్రీ(ఒబైద్ బాబా సాహెబ్) పర్యవేక్షించనున్నారు.మండి బజార్ నుంచి ప్రారంభమయ్యే ఊరేగింపు నగరంలోని పలు ప్రాంతాల మీదుగా సాగి హజ్రత్ సయ్యద్ షా జలాల్ ఉద్దీన్ జమాల్ అల్ బహర్ మషాఖ్ రబ్బానీ (రహ్మతుల్లాహి అలైహి) బర్గా వద్ద ముగుస్తుందని తెలిపారు.ప్రవక్త ముహమ్మద్ అభిమానులు,అహ్లల్ బైత్ ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఊరేగింపును విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.మరిన్ని వివరాలకు:8919108851,9989733485 నంబర్లను సంప్రదించవచ్చు.